ప్రశాంతంగా ఎన్నికలు

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని సిర్పూర్‌లో ప్రశాంతంగా పోలింగ్ జరిగినట్లు జిల్లా అదనపు కలెక్టర్, సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారి అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని, పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

ఆలస్యంగా వచ్చి.. ఓటు వేయలేక



గేట్ ముందు ఓటర్లు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన 30 మంది ఓటర్లు పోలింగ్ కేంద్రానికి సమయానికి వెళ్లకపోవడంతో ఓటు వేయలేక పోయారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల తర్వాత ఓటర్లు పోలింగ్ కేంద్రానికి రావడంతో అధికారులు వారిని అనుమతించలేదు. కాగా పోలింగ్ సమయంపై తమకు అధికారులు అవగాహన కల్పించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బోరిగాం గ్రామస్తులకు అవగాహన



బోరిగాం గ్రామస్తులతో భజరంగ్‌దళ్ సభ్యులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని బోరిగాం గ్రామస్తులు తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని ఎంపీ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించారు. విషయం తెలుసుకున్న జగన్నాథ్‌పూర్ భజరంగ్ దళ్ సభ్యులు బోరిగాం గ్రామస్తులకు ఓటుహక్కుకు గల విలువపై అవగాహన కల్పించారు. సభ్యులు శివగౌడ్, అరుణ్, శుభం, సుమిత్, సురేశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

చల్లటి గాలి, నీరు..



కేంద్రంలో ఏర్పాటు చేసిన చల్లటి తాగునీరు

దహెగాం: పార్లమెంటు ఎన్నికలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఓటర్లకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలోని 266 పోలింగ్ కేంద్రంలో క్యూలైన్‌లో ఉన్న ఓటర్ల కోసం కూలర్‌తో పాటు చల్లటి తాగునీటి సౌకర్యం కల్పించారు.

అంధకారంలో దహెగాం

దహెగాం: మండలంలో ఆదివారం సాయంత్రం గాలి దుమారానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో మండలంలోని ప్రజలు అర్ధరాత్రి వరకు అంధకారంలో ఉన్నారు. సోమవారం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకోగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి గాలి, వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

జైనూర్: మండల కేంద్రంలో సోమవారం రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఇద్దరి మధ్య జరిగిన చిన్న గొడవ రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా ఓ వర్గం వారు మండల కేంద్రంలోని సంజీవ్‌నగర్(వడ్డెరగూడ) కాలనీకి వెళ్లి మరో వర్గానికి చెందిన వారి ఇండ్లపై రాళ్లతో దాడి చేశారు. ఘర్షణను చిత్రీకరించడానికి వెళ్లిన విలేకరుల సెల్‌ఫోన్లను సైతం ఓ వర్గం వారు ధ్వంసం చేశారు. అనంతరం బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బీజేపీ నాయకులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘర్షణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎస్సై సందీప్‌కుమార్‌ను వివరణ కోరగా విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

కాలినడకన వెళ్లి..



కాలినడకన పోలింగ్‌స్టేషన్‌కు వస్తున్న ఓటర్లు

తిర్యాణి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 33 పోలింగ్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 17,916 ఓటర్లు ఉండగా మధ్యాహ్నం మూడు గంటల వరకు 70.56 శాతం మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. కొటగాం గ్రామానికి చెందిన కొంతమంది ఓటర్లకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ములకలమంద పోలింగ్ స్టేషన్‌లో ఓటు కేటాయించడంతో మహిళలు కాలినడక వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీటితో పాటు మంగి ఓటర్లకు గోపెర పోలింగ్ బూత్‌లల్లో, అర్జున్‌లొద్ది ఓటర్లకు రోంపెల్లిలో ఓట్లు ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా చోట్ల బూత్ లెవల్ అధికారులు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయకపోవడంతో ఓటర్లు పోలింగ్ బూత్‌ల చుట్టూ తిరిగారు. ఉమ్మడి మంగి పంచాయతీ పరిధిలో పదుల సంఖ్యలో ఓట్లు గల్లంతయ్యాయి.



మంగిలో బారులుదీరిన ఓటర్లు

దూరం నుంచి వచ్చి..



వీల్‌చైర్‌లో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధురాలు

చింతలమానెపల్లి: మండలంలో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 33 కేంద్రాలలో పోలింగ్ నిర్వహించగా ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల ఎదుట ఓటర్లు బారులుదీరారు. మండలంలోని సరిహద్దు గ్రామాలు గూడెం, కోయపెల్లి పోలింగ్ కేంద్రాలలో మావోయిస్టు ప్రభావం నేపథ్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. అడెపల్లి పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 82.30 శాతం పోలింగ్ నమోదైంది. కాగా పలువురు యువతీయువకులు పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటుహక్కును వినియోగించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. మండలంలో మొత్తంగా 75.77శాతం పోలింగ్ జరిగింది.



బాలాజీ అనుకోడలో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధులు

తిరుపతి నుంచి వచ్చా



నా ఓటుహక్కు వినియోగించుకోవడానికి తిరుపతి నుంచి వచ్చాను. నేను తిరుపతిలోని వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నాను. ఎన్నికల సందర్భంగా స్వగ్రామం చింతలమానెపల్లికి వచ్చాను. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవడం బాధ్యతగా భావిస్తున్నా.

– తోంబ్రె సాయికృష్ణ, చింతలమానెపల్లి

తొలిసారి వినియోగించుకున్నా



పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి ఓటుహక్కు వినియోగించుకున్నా. చెన్నైలో చదువుకునే నాకు ఇటీవల ఓటుహక్కు వచ్చింది. ఓటు వేయడానికి ఆసక్తిగా ఎదురుచూశాను. ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కును ఓటు కల్పిస్తుంది. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాల్సిందే.

– మిర్యాల అభిషేక్, బాలాజీ అనుకోడ

ఉదయం నుంచే క్యూలైన్‌లో..



మోతుగూడలో ఓట్ల కోసం లైన్‌లో ఓటర్లు

ఆసిఫాబాద్‌రూరల్: లోక్‌సభ ఎన్నికలు సోమవారం మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. ఎండ తీవ్రత ఎక్కువ ఉండటంతో ఓటర్లు ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఓటర్లలకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,27,208 ఓట్లకు గాను 67.21 శాతంతో 1,57,706 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.



వీల్‌చైర్‌లో ఓటు వేసేందుకు వెళ్తున్న వృద్ధురాలు



ఓటు వేయడానికి పరుగులు తీస్తున్న ఓటర్

సాయంత్రం 4గంటల సమయంలో పోలింగ్ సమయం దగ్గరపడుతుండడంతో పలువురు ఓటర్లు పోలింగ్ కేంద్రానికి పరుగులు తీశారు. కౌటాల పోలింగ్ కేంద్రాన్ని ఆదిలాబాద్ పార్లమెంట్ పోలీస్ పరిశీలకులు రాజీవ్‌కుమార్ సక్సెనా పరిశీలించారు. సాయంత్రం 7 గంటల సమయంలో ఎన్నికల అధికారులు ఈవీఎం మిషన్లతో పోలింగ్ కేంద్రాల నుంచి వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. సీఐ సాధిక్ పాషా, ఎస్సై మధుకర్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

దహెగాంలో..



వీల్‌చైర్ సహాయంతో వెళ్తున్న వృద్ధురాలు



ఇట్యాల పోలింగ్ కేంద్రంలో క్యూలైన్‌లో ఓటర్లు



దహెగాంలో బారులుదీరిన ఓటర్లు

దహెగాం: మండలంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 26,078 మంది ఓటర్లు ఉండగా, 13,014 పురుషులు, 13,064 మహిళా ఓటర్లు ఉన్నారు. 43 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని స్థానిక 267 పోలింగ్ కేంద్రంలో పది నిమిషాలు ఈవీఎం మొరాయించింది. మండలంలోని ఇట్యాలలో మోడల్ పోలింగ్ కేంద్రం ఓటర్లను ఆకట్టుకుంది. పార్వతిపేట పోలింగ్ కేంద్రంలో 91శాతం, లోహాలో 86శాతం, బ్రహ్మన్‌చిచ్యాలలో 85శాతం, బీబ్రాలో 82శాతం, బామానగర్‌లో 82 శాతం, ఇట్యాలలో 86శాతం పోలింగ్ జరిగిందని అధికారులు పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీఆర్‌పీఎఫ్ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

కౌటాలలో..



కౌటాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు ఆర్‌కే సక్సెనా

కౌటాల: మండలంలో సోమవారం ఎంపీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఆయా గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు పోటెత్తారు. ఉదయం నుంచే ఓటర్లు బారులుదీరారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతతో పలువురు ఓటర్లు గొడుగులతో పోలింగ్ కేంద్రానికి వచ్చారు. తొలి ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఓటర్లతో కిటకిట..



పోలింగ్ ప్రక్రియ పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్



మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన 47 పోలింగ్ కేంద్రాల్లో మండల ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎండల తీవ్రత కారణంగా ఉదయం పూట పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిటకిటలాడాయి. ఓటు వేసేందుకు క్యూలైన్లలో బారులుదీరారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ నిలిపివేశారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను ఎన్నికల సిబ్బంది స్ట్రాంగ్ రూంలకు తరలించారు. అంతకుముందు ఎన్నికల ప్రక్రియను రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్‌లతో కలిసి ఎస్పీ సురేశ్‌కుమార్ పరిశీలించారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు సందర్శించారు.



కొత్త పులికుంటలో విధులు ముగించుకొని వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

వాంకిడిలో..



ఖమాన కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు

వాంకిడి: మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటుహక్కు వినియోగించేందుకు వచ్చిన ప్రజలకు సౌకర్యాలు కల్పించారు. ఎక్కడా అల్లర్లు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టారు.

డీఎస్పీ సందర్శన..



ఎస్సైకి సూచనలు చేస్తున్న డీఎస్పీ సదయ్య

కెరమెరి: మండలంలోని 41 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 23,684 మంది ఓటర్లు ఉండగా, సుమారు 16,680 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలోని ధనోరా, ఝరి, కెరమెరి, సుల్తాన్‌గూడ, నెహ్రూనగర్ పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ సదయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్‌కి పలు సూచనలు చేశారు. సుమారు 200లకు పైగా యువకులు మొదటి సారిగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. చివరి క్షణంలో సుల్తాన్‌గూడ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్ కొంతసేపు మొరాయించింది.



కొడుకుతో ఓటు వేసేందుకు వచ్చిన మహిళ

పోటెత్తిన ఓటర్లు..

సిర్పూర్(టి): మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి. మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో మొత్తం 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగింది. సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలో 8 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మండలంలోని ఇతర గ్రామాల్లో 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీటి వసతి కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ సాదిక్ పాష, ఎస్సై దీకొండ రమేశ్‌ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద

లింగాపూర్‌లో..



లింగాపూర్‌లో బారులుదీరిన ఓటర్లు

లింగాపూర్: మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో మండలంలోని 17 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. మండలంలోని మొత్తం 10,369 ఓటర్లు ఉండగా, 7720 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 74శాతం ఓటింగ్ నమోదైంది.



కంచన్‌పల్లిలో పోలింగ్ ముగిసిన అనంతరం వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

జైనూర్‌లో..



జైనూర్‌లో సూచనలు చేస్తున్న డీఎస్పీ సదయ్య

జైనూర్: మండల కేంద్రంలోని 33 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి. ఈ సందర్భంగా మండల అధికారులు ఎన్నికల పోలింగ్‌శైలిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. వృద్ధులు నడవలేని పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేశారు. డీఎస్పీ సదయ్య జైనూర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి పోలీసులకు సూచనలు చేశారు. వైద్య సిబ్బందిచే వైద్య శిబిరాలు నిర్వహించారు. వంజరి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ముండే కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశారు.



జైనూర్‌లో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలు

68.14శాతం పోలింగ్



ఓటు వేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ -అనిత దంపతులు



ఓటు వేసిన కోనేరు కోనప్ప



ఓటు వేసిన రావి శ్రీనివాస్

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలో ఎంపీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్‌లో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని శిశుమందిర్ పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఓటు వేశారు. పట్టణంలోని 83వ పోలింగ్ బూత్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ దంపతులు ఓటు వేశారు. సిర్పూర్ నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటలకు 68.14 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వెనుదిరిగిన ఓటర్లు..

పెంచికల్‌పేట్: మండలంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 21 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఉదయం నుంచి ఓటర్లు ఓటు వేయడానికి బారులుదీరారు. మండల వ్యాప్తంగా 70శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పలు పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఓటర్లు పోలింగ్ కేంద్రానికి రావడంతో అధికారులు ఓటు వేసేందుకు అనుమతించలేదు.

జిల్లా కేంద్రంలో..



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో వీల్‌చైర్‌పై మహిళను తరలిస్తున్న సిబ్బంది



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్న వృద్ధురాలు



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో కొత్తగా ఓటుహక్కు వినియోగించుకున్న యువతి

ఫిర్యాదు

కౌటాల: బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని ఓటర్లకు ఓటర్ స్లిప్పులపై నరేంద్రమోదీ, గోడం నగేశ్ ఫొటోలతో ప్రింట్ తీసిన పత్రాలను పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు.